# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 39 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 13 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :39 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 13 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

### స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

- మిగతా 2లో



## బంగాళాఖాతంలో అల్పపీడనం..

### దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

పెన్ పవర్ డెస్క్:దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి.

- మిగతా 2లో



## తిరుపతి స్వరూపం మారనుంది..

## వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

**భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్**

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది

- మిగతా 2లో

## ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది.

- మిగతా 2లో

## 'నో' చెప్పారా.. మీ ఖాతాలో నగదు మాయం

హైదరాబాద్:పెన్ పవర్ : సైబర్ మోసాలపై హైదరా బాద్ సీపీ సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. 'నో' అని ఒక్కసారి రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముం దని చెప్పారు. ఓటీపీలు చెప్పకపోయినా.. లింకులపై క్లిక్ చేయకపోయినా నగదు మాయమయ్యేలా



- మిగతా 2లో

## ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాలు నిర్మించడమే లక్ష్యమన్న ఆనం
- ప్రతి నియోజకవర్గంలో రూ.5 నుంచి రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం
- 6,700 ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు నెలకు రూ.10,000 జమ

- మిగతా 2లో





## ఎల్‌ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్‌ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం
- మెంధర్‌లో రెండు పాత మందుపాతరలను నిర్వీర్యం చేసిన సైన్యం

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక

- మిగతా 2లో

## విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

- విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
- ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
- మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

- మిగతా 2లో





## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

### సుప్రీంకోర్టులో ఇండియా కూటమి పిటీషన్లలోని ముఖ్యాంశాలు

పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ లపై ఇండియా కూటమి నేతలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2026 అక్టోబర్ 12న

- మిగతా 2లో

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం



పెన్ పవర్ డెస్క్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

- మిగతా 2లో

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..

### రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం



- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోజనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు

- మిగతా 2లో




## 2100 నాటికి మానవ వినాశనం? 17 ముప్పులను గుర్తించిన లాన్సెట్!

రాబోయే 75 ఏళ్ల కాలంలో మానవాళి మనుగడ తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందా? శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని పురోగతి సాధిస్తున్న మనిషి, తన చేతులారా తనే వినాశనాన్ని కొనితెచ్చుకుంటున్నాడా? అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ 'ది లాన్సెట్' విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. 2100 నాటికి మానవ ఉనికికే ఎసరు పెట్టే 17 ప్రధాన ముప్పులను నిపుణులు గుర్తించారు. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆ తీవ్ర ముప్పుల విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

**మనిషి కొనితెచ్చుకుంటున్న వినాశనం:**
ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలు లేదా అంటువ్యాధుల వల్ల మాత్రమే మానవాళికి ముప్పు ఎదురయ్యేది. కానీ రాబోయే రోజుల్లో ప్రపంచానికి ఎదురయ్యే అతిపెద్ద ముప్పులు పూర్తిగా మానవ నిర్మితమేనని లాన్సెట్ కమిషన్ హెచ్చరించింది. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆధునిక సాంకేతికత, అణ్వాయుధాలు మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిస్తున్న తీవ్ర నిర్లక్ష్యమే ఈ వినాశనానికి ప్రధాన కారణాలుగా మారనున్నాయి.

**ఏఐ దుర్వినియోగం, అణు యుద్ధ భయాలు:**
కృత్రిమ మేధ సాంకేతికతను సరిగ్గా వాడుకుంటే పర్వాలేదు కానీ, దాని దుర్వినియోగం పెరిగితే కోట్లాది మంది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు అణు సమరం గనుక సంభవిస్తే.. దాని వల్ల వచ్చే పొగ, ధూళి సూర్యరశ్మిని భూమికి చేరకుండా అడ్డుకుంటాయి. ఇక దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి, పంటలు పండక ఆకలి చావులు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని ఈ అధ్యయనం హెచ్చరించింది.

**కనిపించని ఆరోగ్య, సామాజిక సంక్షోభం:**
ఇక కేవలం అణు యుద్ధాలు లేదా ఏఐ మాత్రమే కాకుండా వాతావరణ మార్పులు, పెరిగిపోతున్న వాయు కాలుష్యం, మానసిక ఆరోగ్య సమస్యలు కూడా మానవాళిని కుంగదీస్తున్నాయి. పోషకాహార లోపం, పెరుగుతున్న ఊబకాయం, యాంటీబయోటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా.. ఈ సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

**సమగ్ర ప్రణాళికలతోనే పరిష్కారం:**
ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు చేపడితే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సైనిక బడ్జెట్లు, ఆయుధాలపై ఖర్చు చేయడం కంటే ప్రజారోగ్యం, పర్యావరణం, ఏఐ సేఫ్టీ కోసం పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. ఇక 35 మంది అగ్రశ్రేణి నిపుణులతో కూడిన కమిషన్ ఈ ప్రమాదాలపై ఏటా సమీక్ష నిర్వహిస్తూ నివేదికను నవీకరించనుంది. ఇక మొత్తానికి చూస్తే, 2100 నాటికి మానవ మనుగడ సాఫీగా సాగాలంటే ఇప్పటి నుంచే మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన వినాశనానికి దారితీసే అవకాశాలను మనమే తొలగించుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, టెక్నాలజీని మంచి పనుల కోసం ఉపయోగిస్తేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలం.

# బంగాళాఖాతంలో అల్పపీడనం..

- మొదటి పేజి తరువాయి

దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

## ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా**
ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3
ఎస్టీ – మహిళ: గూడూరు
ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు
**ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14**
ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.
ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.
బీసీ (వెనుకబడిన తరగతులు) – 35
బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.
బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

**జనరల్ కేటగిరీ (మహిళ)**
ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.
కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస–కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

**అన్‌రిజర్వ్ (జనరల్)**
కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.
పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.
ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.
త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

## విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 'నో' చెప్పారా.. మీ ఖాతాలో నగదు మాయం

- మొదటి పేజి తరువాయి

సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేవలం వాట్సప్ సందేశాలతోనే, ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్లు క్షణాల్లో సొమ్ము స్వాహా చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందంటూ గుర్తు తెలియని నంబర్ల నుంచి నకిలీ సందేశాలు పంపించి, లావాదేవీ చేయకపోతే 'నో' అని రిప్లై ఇవ్వాలని అడుగుతారని, ఆ సందేశాలకు స్పందించగానే మాల్‌వేర్ స్క్రిప్ట్‌లు యాక్టివేట్ అయ్యి.. మొబైల్ హ్యాకర్ల నియంత్రణలోకి వెళ్లే అవకాశముందని చెప్పారు. ఇటీవల చార్టర్డ్ అకౌంటెంట్ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాని, అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే బ్యాంకు లావాదేవీల సందేశాలకు ఎస్, నో అంటూ ఎలాంటి సమాధానమివ్వొద్దని సూచించారు. ఖాతాలో నగదు తగ్గిందన్న సందేశం వస్తే.. అధికారిక బ్యాంకు యాప్‌లో స్టేట్‌మెంట్ తనిఖీ చేసుకోవాలని, ఇంకా అనుమానముంటే అధికారిక కస్టమర్ కేర్‌నే సంప్రదించాలని కోరారు. సైబర్ మోసం వల్ల డబ్బు పోగొట్టుకున్నట్లయితే 1930కి కాల్ చేయాలనీ, లేదంటే ఎఎవతీఎతీఅఎవ.త్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

## తిరుపతి స్వరూపం మారనుంది..
## వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

**టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం**
దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు**
తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.
సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.
మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.
హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ–నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

- మొదటి పేజి తరువాయి

కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు. బ్రజ్ మోహన్ రామ్ ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ సుధా యాదవ్ కర్ణాటక గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ ధల్ సింగ్ బిసెన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. దుష్యంత్ గౌతమ్ సిక్కిం గవర్నర్‌గా నియమితులయ్యారు.

## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

- మొదటి పేజి తరువాయి

మార్చ్ ఫర్ డెమొక్రసీ నిర్వహించిన కూటమి నేతలు.. రాహుల్ గాంధీ సహా 11 మంది సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను సుప్రీం కోర్టు స్వీకరించింది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను రెస్పాండెంట్లుగా చేర్చారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సౌగత్ రాయ్ (టీఎంసీ), అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), తేజస్వి ప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), సంజయ్ రౌత్ (శివసేన యూబీటీ), ఎంఏ బేబీ (సీపీఎం), డీ రాజా (సీపీఐ), మహువా మాఝీ (జేఎంఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ శరద్ పవార్), ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) మొదలైన 11 మంది నేతలు పిటిన్లు దాఖలు చేశారు.

**పిటిషన్లలో ఏముంది..?**
సర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఫైళ్లు, ఎజెండాలు, నిమిషాలు, నోటింగ్స్, అభ్యంతరాలు బయటపెట్టాలని కోరారు. జాతీయ స్థాయిలో వా×= ప్రారంభించాలని ఎన్నికల సంఘం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు రికార్డులు లేవని =× సమాధానాల ఆధారంగా పేర్కొన్నారు. ఫారం–6ను నిబంధనలు సవరించకుండానే మార్చారని, ఇది మొదటి సారి ఓటు వేసేవారిపై అనవసర భారం వేస్తుందని విమర్శించారు.
2025 జూన్ 24 న సర్ ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయంతోపాటు ఈసీనెట్, ఈఆర్‌ఓనెట్ యాక్సెస్ లాగ్‌లను వెల్లడించాలని కోరారు. జుజ×చీజు, జు=ాచీజు డేటాబేస్‌లు పారదర్శకంగా పనిచేయడం లేదని, ఓటరు పేర్లు తొలగించిన తర్వాత తిరిగి చేర్చే సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ దశలో తొలగింపుకు గురయ్యాయని పేర్కొంటూ, అర్హులైన ఓటర్లు బయట పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ఎన్నికల సంఘం సమష్టి అధికారాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒంటరిగా వినియోగించుకున్నారని ఆరోపణ. ఇతర ఎన్నికల కమిషనర్ల అనుమతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.
ఆర్టికల్ 324, 2023 చట్టం, టీఎన్ శేషన్ కేసు తీర్పు ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారా అని పరిశీలించాలని కోరారు. ఎలాంటి నోటీసు లేకుండా, వాదన వినిపించుకునే అవకాశం లేకుండా ఏ ఓటరును తొలగించకూడదని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్ల జాబితాను బూత్ వారీగా, కారణాలు, డెమొగ్రాఫిక్ వివరాలతో ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో స్వతంత్ర ఆడిట్ కమిటీ ఏర్పాటు చేసి ఓటరు జాబితా మార్పులను పరిశీలించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు సర్ ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్ లో పేర్కొన్నారు.

## ఎల్ఓసీ వద్ద మందుపాతర పేలుడు:
## నలుగురు ఉగ్రవాదులు మృతి

- మొదటి పేజి తరువాయి

కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్–నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు సమాచారం.
ఎల్ఓసీ ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకునేందుకు మందుపాతరలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే భారీ వర్షాల కారణంగా అవి బయటపడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో వాటిని గుర్తించడం, భద్రతను నిరంతరం పర్యవేక్షించడం సైన్యానికి సవాలుగా మారుతోంది.

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..
## రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.
రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం







- రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సులో రూ.6,347 కోట్ల పెట్టుబడులకు ప్రోత్సాహం
- 18 వేల మందికి ఉపాధి అవకాశాలు

**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12** :ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు కేవలం లాభాలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సోమవారం కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పవన్ కళ్యాణ్ విమర్శించారు. ప్రస్తుతం పెట్టుబడిదారులను ఆహ్వానించడంతోపాటు రాష్ట్రానికి, ప్రజలకు వారు ఏ విధంగా తోడ్పడగలరనే అంశానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు.

### రూ. 6,347 కోట్ల పెట్టుబడులతో కొత్త అవకాశాలు

కాకినాడలో తొలిసారిగా సీఐఐ ప్రాంతీయ సదస్సు నిర్వహించడం సంతోషకరమని పవన్ కళ్యాణ్ అన్నారు. విశాఖపట్నం తర్వాత రాష్ట్రంలో రెండో ప్రాంతీయ సదస్సుకు కాకినాడ వేదిక కావడం విశేషమన్నారు. ఈ సదస్సు ద్వారా రూ. 6,347 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాలు ముందుకు సాగడం పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ. 4,652 కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమమైందని, రూ. 2,090 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నాలుగు ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, పరిసర ప్రాంతాల్లో సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువతకు ఉద్యోగాలు రావడంతోపాటు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని చెప్పారు.

### సింగపూర్ అభివృద్ధి మనకు స్ఫూర్తి

సింగపూర్ ఒకప్పుడు అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ సంకల్పబలం, సమష్టి కృషితో అభివృద్ధి చెందిన దేశంగా నిలిచిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. స్విట్జర్లాండ్ అభివృద్ధి నమూనా కూడా స్ఫూర్తిదాయకమన్నారు. స్పష్టమైన లక్ష్యం, ఐక్యత, జాతీయ భావనతో పనిచేస్తే దేశాన్ని ప్రగతి పథంలో నడిపించవచ్చని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉందని, అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తోందని చెప్పారు. అదే సమయంలో పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జంషెడ్జీ టాటా దేశాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పరిశ్రమలను కేవలం లాభాలు ఆర్జించే మార్గాలుగా కాకుండా దేశాభివృద్ధికి దోహదపడే సాధనాలుగా చూడాలని అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు.

### 714 ప్రాజెక్టుల ద్వారా రూ. 22.6 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 2024 జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ. 22.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. వీటిలో రూ. 16.6 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు పూర్తయ్యాయని, రూ. 4.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చాయని వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పారదర్శకంగా, వేగంగా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రతలు, సుస్థిర పాలనపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు.

### తీర ప్రాంత పరిరక్షణకు ప్రాధాన్యం

కాకినాడలో సముద్ర రవాణా, నౌకా నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, రసాయన, ఆహార శుద్ధి, ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం విలువైన వనరని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పారిశ్రామిక అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పచ్చదనం పెంపు, తీర ప్రాంత రక్షణ, సముద్ర జీవుల మనుగడకు అనుకూలమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిశ్రమల స్థాపన ప్రారంభ దశ నుంచే పర్యావరణహిత విధానాలను అనుసరించాలని స్పష్టం చేశారు.

### పల్లెలు, గిరిజన ప్రాంతాలకూ పెట్టుబడులు రావాలి

రాష్ట్రంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పల్లె పండుగ, అడవితల్లి బాట కార్యక్రమాల ద్వారా గ్రామాలు, గిరిజన ఆవాసాల్లో రహదారులు, డ్రైనేజీలు, అనుసంధాన మార్గాలు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల కోసం రూ. 1.70 లక్షల కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. పారిశ్రామికవేత్తలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని కోరారు. దీనివల్ల అభివృద్ధి అన్ని ప్రాంతాలకు విస్తరించడంతోపాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

### రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రంగం అభివృద్ధి చెందేలా, ప్రతి వర్గం పురోగతి సాధించేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పవన్ కళ్యాణ్ అన్నారు. స్థానికంగా పెట్టుబడులు రావడం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వ్యాపార రంగం విస్తరిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు, మత్స్యకారులకు కూడా పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ప్రయోజనం కలగాలని ఆకాంక్షించారు. "ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో మాతో కలిసి నడవండి. ప్రజల అభ్యున్నతి కోసం పనిచేయండి. పర్యావరణహిత పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కండి" అని పవన్ కళ్యాణ్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం







**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12** :కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు సోమవారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం సత్య, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.



## ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణం సుగమం చేయండి



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులు ఆలమూరు జాలర్ల పేట నుంచి సూర్యారావుపేట ఆర్ అండ్ బి రోడ్డుకు వెళ్లే మార్గం నిర్మాణానికి ఆక్రమణలు తొలగించి వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఏ.రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఈ మార్గంలో నాలుగు కుటుంబాల వారు ఆక్రమించుకొని నివసిస్తున్నారన్నారు. వారిలో ముగ్గురికి ఇప్పటికే స్థలాలు మంజూరు చేశారని, మరొకరికి స్థల సేకరణ జరుగుతుందన్నారు. అయితే బీటీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై ఎంపీడీవో రాజు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రామానుజుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, కేతా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య, పారిశుద్ధ్య మరియు పోషకాహార అవగాహన దినోత్సవం




**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్, 12:**ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్–8 ఆధ్వర్యంలో దత్తత గ్రామం కోటపాడు గ్రామంలో "ప్రపంచ ఆరోగ్య, పారిశుద్ధ్య మరియు పోషకాహార అవగాహన దినోత్సవం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ప్రో ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎం. రమాశ్రీ, డీన్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ డి. కిషోర్ , ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డాక్టర్ ఐ.వి. వీరాంజనేయులు , స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ఽ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవి తంగజం , మరియు అసోసియేట్ డీన్ డాక్టర్ బి. సౌజన్య గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం, పరిశుభ్రత మరియు సరైన పోషకాహారం పట్ల అవగాహన పెంపొందించడం ఎంతో అత్యవసరమని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా ఎలా రక్షించుకోవచ్చు వివరించారు. నిత్యం తీసుకునే ఆహారంలో పోషకాల ప్రాముఖ్యత ను తెలుపుతూ, పౌష్టికాహార పదార్థాల గురించి గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఆర్. లక్ష్మి దేవరకొండ, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి సుష్మా అంజనీ దేవి మరియు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అదేవిధంగా...

**కొండపల్లిలో "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమం**

ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో కొండపల్లిలో "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు.పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం ప్రాముఖ్యత, చెత్త నిర్వహణ మరియు పరిశుభ్రమైన వాతావరణం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గ్రామ పరిసరాలను శుభ్రంగా ఉంచడం, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడతాయని, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీన్ -- స్టూడెంట్ యాక్టివిటీస్ డా. డి. కిషోర్, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డా. ఐ.వి. వీరాంజనేయులు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ జె. విద్య, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.ఎల్. సోమనాయుడు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, అధ్యాపకులు మరియు కొండపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులు, విద్యార్థుల్లో పరిశుభ్రత, పారిశుధ్యం మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందింది. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్.ఎస్.ఎస్. సేవలను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ జగ్గంపేట నియోజకవర్గ సమన్వయకర్తగా గవర సుధాకర్ ఎన్నిక




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 12:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంలో భాగంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీ వారికి అందించేందుకు అసెంబ్లీ కోఆర్డినేషన్ కమిటీలను జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. జగ్గంపేట నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్తగా జగ్గంపేటకు చెందిన జనసేన సీనియర్ నాయకులు గవర సుధాకర్ నియమితులయ్యారు. నిర్వాహక దళ్, సపోర్టు టీం సభ్యులు సహకరించిన వివరాలను నియోజకవర్గ సమన్వయకర్తలు పరిశీలించి పార్లమెంటరీ కోఆర్డినేషన్ కమిటీకి చేరవేస్తారు. తనను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడం సంతోషంగా ఉందని సుధాకర్ అన్నారు. తనపై నమ్మకం ఉంచిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ కు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ సమన్వయకర్తగా బాధ్యతతో పనిచేస్తానన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 12:** స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ సోమవారం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెం శివారు సగరపేటకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు రూ. 78వేలు విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు, రేఖా బుల్లి రాజు, జిల్లా గఫూర్, కుంచే తాతాజీ, పోంద్రు బాలనాగు, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**జగ్గంపేట పెన్ పవర్, అక్టోబర్ 12::** జగ్గంపేటలో దసరా ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా జరిగాయి. గ్రామ దేవత శ్రీ రావులమ్మ తల్లి ఆలయం, దేవి సెంటర్ లో వెలిసిన లలితా భువనేశ్వరి అమ్మవారు, చెరువు గట్టుపై వెలసిన కనకదుర్గమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. జగ్గంపేట దేవి సెంటర్లో లలిత భువనేశ్వరి దేవిని రెండవ రోజు బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో గ్రామ జనసేన అధ్యక్షులు గంధం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో సోమవారం జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

### కాట్రావులపల్లిలో ఎక్స్‌పోజర్ విజిట్, శిక్షణ కార్యక్రమం




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 12:** మండలంలోని కాట్రావులపల్లి గ్రామ పంచాయతీ ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్ వద్ద మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికారులు, గ్రీన్ అంబాసిడర్లకు ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డిపిఆర్సి రిసోర్స్ పర్సన్, గ్రామ ప్రత్యేక అధికారి గ్రామ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పలు అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రాయోగిక శిక్షణ అందించారు. తడి చెత్త మరియు పొడి చెత్త సేకరణ, నిర్వహణ, రైతుల నుంచి పేడ సేకరించి ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్‌కు తరలించడం, నాడెప్ కంపోస్ట్ తయారీ విధానం, నాడెప్ తోట్లలో ఆకుకూరల పెంపకం, వర్మీ బెడ్ల తయారీ మరియు వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్ నిర్వహణ, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, తయారైన వర్మీ కంపోస్ట్ ప్యాకింగ్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా అన్ని గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం, ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్లను సక్రమంగా వినియోగించడం, సేంద్రియ ఎరువుల తయారీని ప్రోత్సహించడం మరియు గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో ఆధునిక పరిశ్రమలో అవకాశాలపై నిపుణుల ఉపన్యాసం



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 12:** అదిత్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన నిపుణుల ఉపన్యాస కార్యక్రమంలో టీవీఎస్ శ్రేష్ఠ ఇన్‌ఫ్రాకాన్ హెచ్ఆర్ హెడ్ డా. ఇరుదయరాజ్ మరియజేసు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధునిక పరిశ్రమలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమేషన్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కేవలం విద్యా అర్హతలు సరిపోదు. ప్రాక్టికల్ నైపుణ్యాలు, సమస్యా పరిష్కార సామర్థ్యం, జట్టు పని, నిరంతర అభ్యాసం అత్యవసరమని స్పష్టం చేశారు. "పరిశ్రమలు సాంకేతిక పరిజ్ఞానం తో పాటు అనుకూలత, నాయకత్వ లక్షణాలు కలిగిన యువతను కోరుకుంటున్నాయి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్‌ల ద్వారా సిద్ధం కావాలి" అని డా. ఇరు దయ రాజ్ అన్నారు. ప్రో వైస్ ఛాన్సలర్ (ఈ ఽ ఎస్) డా. ఎ. రమేష్, డీన్ కెరీర్ డెవలప్‌మెంట్ డా. జి. సంజీవ్ రావు, సివిల్ విభాగాధిపతి డా. రామ్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలపై అవగాహనా సదస్సు

**విద్యార్థులు చదువుపై ఆసక్తి, దృఢ సంకల్పం పెంపొందించుకోవాలి: ప్రొఫెసర్ మురళీకృష్ణ**




**గండేపల్లి పెన్ పవర్, అక్టోబరు 12:** ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వృత్తి నైపుణ్యాల ప్రాధాన్యాన్ని వివరించే లక్ష్యంతో సోమవారం 'ఇంజనీర్లకు అవసరమైన పది వృత్తి నైపుణ్యాలు' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సదస్సు ద్వారా విద్యా ప్రాధాన్యత, వృత్తి నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ మాజీ ఉపకులపతి, పౌర నిర్మాణ ఇంజనీరింగ్ ఆచార్యులు ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి. మురళీకృష్ణ హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ వివరాలను కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు వెల్లడించా ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తార్కిక ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చదువు మనిషి జీవితానికి ఎంతో ముఖ్యమని, విద్యను నిర్లక్ష్యం చేసే విద్యార్థులు భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. విద్యపై ఆసక్తిని పెంపొందించుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.

అనంతరం తాను రచించిన బికమింగ్ జీనియస్, ఇరవై అత్యుత్తమ వృత్తి నైపుణ్యాలు, ముప్పై భాషల ద్వారా నాయకత్వ లక్షణాలు, కృత్రిమ మేధస్సు సాధనాలు--వాటి అనువర్తనాలు అనే పుస్తకాలలోని ఆసక్తికరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనా విధానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఈ నైపుణ్యాలను అలవర్చుకుని తమ భవిష్యత్తుకు పటిష్టమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సంచాలకులు ఎం.వి. హరనాథబాబు, ఉపాధ్యక్షులు ఎం. సతీష్, విద్యా వ్యవహారాల సంచాలకులు డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, కార్యక్రమ సమన్వయకర్తలు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి ఇంట వికసించిన బ్రహ్మ కమలం



**పెన్ పవర్ ప్రతినిధి(తుని) అక్టోబర్ 12** :కాకినాడ జిల్లా తుని పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంగారు బ్రహ్మనాయుడు ఇంట్లో అరుదైన బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. రాత్రి వేళ తెల్లని పుష్పంతో విరబూసిన బ్రహ్మ కమలం చూపరులను ఆకట్టుకుంది. బ్రహ్మ కమలం పుష్పం వికసించడంతో బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పుష్పాన్ని చూసేందుకు ఆసక్తి చూపడంతో పాటు, పుష్పం వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. బ్రహ్మ కమలం వికసించడం శుభసూచకమని పలువురు భావిస్తుండటంతో ఈ పుష్పం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది.

అరుదుగా వికసించే ఈ పుష్పం తమ ఇంట్లో పూయడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. బ్రహ్మ కమలం పుష్పాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

## లోవలో ఘనంగా ప్రారంభమైన సరన్నవరాత్రులు

**సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు**



**పెన్ పవర్ ప్రతినిధి (లోవ), అక్టోబరు 12:** కాకినాడ జిల్లా తుని మండలం లోవ క్షేత్రంలోని శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం వేకువజామున వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, శ్రీ తలుపులమ్మ అమ్మవారిని గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చేలా అలంకరించారు.

గాయత్రీ దేవిని నాలుగు వేదాలకు తల్లిగా భక్తులు ఆరాధిస్తారని ఆలయ పండితులు వివరించారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలకు గాయత్రీ దేవి ప్రతీకగా నిలుస్తారని తెలిపారు. ఐదు ముఖాలు, పది చేతులతో దర్శనమిచ్చే గాయత్రీ దేవి రూపం దివ్యశక్తికి ప్రతీకగా భావిస్తారని పేర్కొన్నారు. సమస్త జీవరాశిలో ప్రాణశక్తిని నింపుతూ, బుద్ధిని ప్రకాశింపజేసి, ఆత్మను ధర్మమార్గంలో నడిపించే తల్లిగా గాయత్రీ దేవిని భక్తులు కొలుస్తారని వివరించారు. తనను కీర్తించి ఆరాధించే భక్తులను రక్షించేది అనే అర్థంలో గాయత్రీ దేవి మహిమను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజనం, మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు వేదాశీర్వచనం అందజేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి పి. విశ్వనాథ రాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# కొత్తపేట అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు!

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని టీడీపీ నేతలు తెలిపారు.





**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 12:**కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం, స్థానిక సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయడం వంటి అంశాలపై దృష్టి కొనసాగుతుందని వెల్లడించారు. ప్రతిపక్షాల విమర్శలకు రాజకీయ ఆరోపణలతోనే సమాధానం ఇవ్వకుండా, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందే ప్రయోజనాల ద్వారా సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన అజెండా అని పేర్కొన్న టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పలువురు ముఖ్య నేతల హాజరు ఈ విలేకరుల సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆత్మ కమిటీ ఛైర్మన్ జక్కంపూడి బాలాజీతో పాటు నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# ఐదు జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి సీఐఐ ప్రాంతీయ సదస్సు దోహదం

పరిశ్రమల స్థాపనతో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు






**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 12:**కాకినాడతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు పారిశ్రామికాభివృద్ధికి కేంద్రాలుగా ఎదిగేందుకు సీఐఐ ప్రాంతీయ సదస్సు దోహదపడనుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా సోమవారం కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల ద్వారా ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సదస్సు వేదికగా ముందడుగు పడింది. ఐదు జిల్లాల్లో పారిశ్రామిక పురోగతికి ఉన్న అవకాశాలు, ఉపాధి కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

### పారిశ్రామిక ప్రగతిని చాటిన ప్రదర్శన శాలలు

పారిశ్రామిక రంగంలో సాధించిన పురోగతి, అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఉప్పాడకు సంబంధించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన వివరాలు, ఛాయాచిత్రాలను ప్రదర్శనలో పొందుపరిచారు.

సదస్సులో భాగంగా అవగాహన ఒప్పందాల కార్యక్రమంతోపాటు 15 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు.

### పారిశ్రామికాభివృద్ధికి సమష్టి కృషి

ఐదు జిల్లాల్లో పెట్టుబడులను ప్రోత్సహించి పరిశ్రమల స్థాపనకు అనుకూల పరిస్థితులు కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించింది. పారిశ్రామికాభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ శాఖలు, పారిశ్రామికవేత్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సమావేశం చాటిచెప్పింది. కార్యక్రమం ముగింపులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధి దిశగా ఈ సదస్సు బలమైన ముందడుగుగా నిలిచిందని, కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని తెలిపారు.

### పాల్గొన్న ప్రముఖులు:

ఈ సదస్సులో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, లోక్‌సభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జి. హరీష్ మాధుర్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్, యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ఏపీ ఆర్థిక అభివృద్ధి సంస్థ సీఈవో ఎస్. షణ్మోహన్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్, సీఐఐ వైస్ చైర్మన్ జి. సాంబశివరావు, జేఎన్టీయూ ఉపకులపతి సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, జిల్లా కలెక్టర్లు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కీర్తి చేకూరి, ఆర్. మహేష్ కుమార్, కె. దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం సత్య, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# పత్రికా విలేకరి సిగిరెడ్డి రమేష్‌పై దాడి దుర్మార్గం..



-మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 12**: పత్రికా విలేఖరి సిగిరెడ్డి రమేష్‌పై గోమాఫియా వ్యక్తులు దాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగే దాడిగా భావించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆమె ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలోని రమేష్ నివాసానికి వెళ్లి, ఇటీవల దాడిలో గాయపడిన రమేష్ ను స్వయంగా పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అంగూరి లక్ష్మీ శివకుమారి మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను అందించే జర్నలిస్టులపై ఇలాంటి అసాంఘిక శక్తులు దాడులకు తెగబడటం పత్రికా స్వేచ్ఛ గొంతునొక్కడమేనని మండిపడ్డారు. సమాజంలో అక్రమాలను వెలికితీసే పాత్రికేయులకు రక్షణ కరువైతే, నిజాలు బయటికి రావని ఆందోళన వ్యక్తం చేశారు. పాత్రికేయులపై దాడులకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠినమైన శిక్షలు విధించాలని పోలీసు అధికారులను ఆమె డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెహరా రాజారాజేశ్వరి, మాకినీడి శేషుకుమారి, శెట్టి సత్తిబాబు, చక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉట్రుమిల్లిలో టీడీపీలోకి భారీ చేరికలు





**జనసేనలోకి 20 మంది వైసీపీ కార్యకర్తలు**

**వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం**

**రామచంద్రపురం రూరల్, పెన్ పవర్,అక్టోబర్ 12:**రామచంద్రపురం రూరల్ మండలం ఉట్రుమిల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 60 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఉట్రుమిల్లి గ్రామ టీడీపీ నాయకులు సుంకర చినకాపు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉండ్రాచలపు తిమోతి ఆధ్వర్యంలో, వైసీపీ నాయకుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ సూరంపూడి పుల్లయ్యతో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి టీడీపీ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారందరికీ నాయకులు అభినందనలు తెలిపారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ చేరికలతో ఉట్రుమిల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. మరోవైపు, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కొండ్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 మంది కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి.

ప్రత్తిపాడు అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఉమ్మిడి వెంకట్రావు డిమాండ్.






**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్ 12**:భారత రాజ్యాంగానికి విరుద్ధంగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ పక్షపాతం చూపిస్తూ బిజెపికి అనుకూలంగా ఏకపక్షంగా 13 కోట్ల ఓట్ల తొలగింపునకు పాల్పడిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మడి వెంకట్రావు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు అఖిలపక్ష పార్టీలు, ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాల నాయకులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి అంబేద్కర్ కళామందిర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీగా చేరుకుని భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ బిజెపి కార్యకర్తగా వ్యవహరిస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు పోరాడుతామన్నారు. మోడీ ప్రభుత్వం శాంతియుత ఆందోళనకు సిద్ధపడ్డ జెన్ జి విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టడం పిరికిబంద చర్యగా అభివర్ణించారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేసే హక్కు ఉందని గుర్తుచేశారు. తక్షణమే మోడీ ప్రభుత్వం అరెస్టు చేసిన 10వేల మంది ఆందోళనకారులను, విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన 13 కోట్ల భారతీయుల ఓట్లను పునరుద్ధరించి ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ యొక్క స్వతంత్రతను ప్రజలే పోరటాల ద్వారా కాపాడుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్,బిజెపి నుండి భారత రాజ్యాంగాన్ని,లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాబోయే రోజుల్లో అఖిలపక్షం ముందుండి పోరాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు దరణాల కోట శ్రీను,జిల్లా ఉపాధ్యక్షులు ఊట శ్రీను,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొప్పన కోటేశ్వరరావు, కాకినాడ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షులు రామకుర్తి సూర్యనారాయణ, ప్రత్తిపాడు మండల అధ్యక్షులు దొడ్డిపట్ల సుబ్బరాజు, ఏలేశ్వరం టౌన్ ప్రెసిడెంట్ గుణపు శ్రీనివాస్, ప్రత్తిపాడు సమన్వయ కమిటీ మెంబర్ ధోని వెంకటేశ్వర్లు,సిపిఎం కన్వీనర్ రొంగల ఈశ్వరరావు, సిపిఐ ఎంయల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు,సిపిఎం ఎం యల్ వినోద మిశ్రా నాయకులు గండేటి నాగమణి ,కందుల ప్రసాద్,సిఐటియు నాయకులు పొసపల్లి రమణ,అల్లాడి లక్ష్మీ ,పైలా సూరిబాబు, కె.వరలక్ష్మి, అనంతలక్ష్మి,మరియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అఖిలపక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో వరుపుల సుబ్బారావు భేటీ...

ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ....



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 12:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ సమన్వయకర్త వరుపుల సుబ్బారావు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించినట్లు తెలిసింది. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కీలకమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలని ఈ భేటీ సందర్భంగా అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై నాయకుల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను ఈ సమావేశం తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ సమన్వయకర్త వరుపుల సుబ్బారావుతో పాటు జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు, వరుపుల సత్య సూరిబాబు, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆమె ఎప్పటికీ చిరంజీవినే!

- ఐడియల్ కళాశాలలో చిరంజీవిని కుమారి విగ్రహావిష్కరణ
- విద్యార్థుల హృదయాల్లో ఆమె చిరంజీవి
- గరికిపాటి ప్రసంగంపై మిశ్రమ స్పందన



**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12 :**ఐడియల్ కళాశాల పూర్వ కరస్పాండెంట్, సామాజికవేత్త డాక్టర్ చిరంజీవిని కుమారి భౌతికంగా దూరమైనప్పటికీ, తన సేవలు, ఆశయాలతో ఎప్పటికీ చిరంజీవిగానే నిలిచిపోతారని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కళాశాల ప్రాంగణంలో సోమవారం చిరంజీవిని కుమారి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.కళాశాల అభివృద్ధిలో చిరంజీవిని కుమారి సేవలు చిరస్మరణీయం.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పూర్వ శాసనసభ స్పీకర్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, కాకినాడలో ఉన్నతమైన ఆశయాలతో సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఐడియల్ కళాశాలను స్థాపించారని గుర్తుచేశారు. అప్పట్లో తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. చిరంజీవిని కుమారి ఆశయాలను కొనసాగిస్తూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ, కాకినాడతో పాటు చిరంజీవిని కుమారితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. ఏ పనినైనా ఎంతో చాకచక్యంగా,ఒత్తిడికి లోనుకాకుండా సమర్థంగా పూర్తి చేసే నైపుణ్యం ఆమె సొంతమని కొనియాడారు. కళాశాలలో తెలుగు భాషకు ప్రాధాన్యం కల్పించడంలో ఆమె పాత్ర కీలకమని పేర్కొన్నారు.తన ఆలోచనలు, సేవలు, కార్యదక్షతతో చిరంజీవిని కుమారి ఐడియల్ కళాశాల విద్యార్థుల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. ఆమె చూపిన మార్గంలో కళాశాల ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**గరికిపాటి ప్రసంగంపై మిశ్రమ స్పందన**

గరికిపాటి నరసింహారావు ప్రసంగాన్ని వినేందుకు పలువురు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే, ఈసారి ఆయన ప్రసంగం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయిందనే అభిప్రాయాలు కొందరు సభికుల నుంచి వ్యక్తమైనట్లు కార్యక్రమంలో చర్చ జరిగింది.అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులతో పాటు విగ్రహ రూపకర్త రాజ్‌కుమార్ వడయార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, బొర్రా గోపీమూర్తి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పర్చూరు కృష్ణారావు, చిరంజీవిని కుమారి కుమారులు గోపాల్, కిరణ్, కళాశాల ఏఓ జీవీకే వర్మ, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన గుడివాడ అమర్నాథ్.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్,12:**ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ సోమవారం పరామర్శించారు. మురళీకృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల కాలంలో స్వర్గస్తులయ్యారు.దీంతో గుడివాడ అమర్నాథ్ సోమవారం ధర్మవరం చేరుకుని మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, రామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు జువ్వల బాబులు, నానిపల్లి చంటి, పోతులూరు మాజీ సర్పంచ్ బొండు రాంబాబు, ప్రత్తిపాడు వైసీపీ ఉపాధ్యక్షుడు కిల్లాడి బాబ్జి, మాజీ ఉపసర్పంచ్ జువ్వల సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొల్లు రాజుబాబు, మచ్చర్ల దాసు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, గదుల శివ, చేకూరి రాంబాబు రాజు, కోన బాబ్జి, గళ్ళా నాగరాజు, దెందుకూరి సత్తిబాబు రాజు, ఎలుగుబంటి బాబ్జి, మచ్చర్ల రాజు, సిద్ధా అప్పలరాజు, సిద్ధ బాబ్జి, కుప్పిన నరసింహమూర్తి, దెందుకూరి రామకృష్ణ రాజు, అడ్డాల సూర్యనారాయణ రాజు, దెందుకూరి జగ్గబాబు రాజు, నానిపల్లి రమణ, కోలా కొండబాబు, దెందుకూరి సీతారామరాజు, పెండ్యాల అబ్బు, జక్కల పోలీస్, కాపరపు బుజ్జిబాబు, జువ్వల రాజా, మర్రి సుబ్బారావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 27వ రోజుకు వీఆర్ఏల నిరసన



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:**మండల కేంద్రమైన ఆలమూరు తాహసిల్దార్ కార్యాలయం ఎదుట గల ధర్నా చౌక్ లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేస్తున్న నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం సోమవారం నాటికి 27వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షులు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ సెక్రటరీ కె.శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, ట్రెజరర్ కుందేటి శ్రీను సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిది వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మీ, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మీ, షేక్ బషీర్ బిబి, తదితరులు పాల్గొన్నారు.

# జయహో బీసీ.. బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం





- ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం
- మానవసేవే నా లక్ష్యం.. పేదల సంక్షేమమే నా సంకల్పం
- మంత్రి వాసంశెట్టి సుభాష్
- నియోజకవర్గంలో రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు
- బీసీల ఆత్మీయ సమ్మేళనంలో కూటమి ఐక్యతకు పిలుపు

**రామచంద్రపురం, పెన్ పవర్,అక్టోబర్ 12 :**బీసీల అభ్యున్నతి, రాజకీయ సాధికారత, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, బీసీలు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో దివంగత ఎన్టీఆర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని అన్నారు.రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో కూటమి సీనియర్ నాయకుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అధ్యక్షతన సోమవారం నియోజకవర్గ స్థాయి బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరై ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు పెంద్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దే**

తెలుగుదేశం పార్టీకి, బీసీలకు విడదీయలేని అనుబంధం ఉందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించే దిశగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని తెలిపారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గాయని మంత్రి విమర్శించారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి జరిగిన నష్టంపై వైఎస్సార్‌సీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నాల్లో అడ్డంకులు ఎదురయ్యాయని ఆరోపించారు. న్యాయపరమైన సమస్యలు ఉన్నప్పటికీ బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి, పార్టీపరంగా 34 శాతానికి మించి ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి కృషి చేస్తుందని తెలిపారు.రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కులాల పేరును ఉపయోగించుకోవడం సరికాదని, బీసీల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేయడమే నాయకుల బాధ్యత కావాలని అన్నారు. తనపై రాజకీయంగా బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, తనకు లేదా తన కార్యక్రమాలకు సంబంధించి అవినీతి జరిగినట్లు ఎవరైనా నిరూపిస్తే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి సవాల్ విసిరారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ పనుల్లో 65 శాతానికి పైగా పురోగతి సాధించినట్లు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, వంతెనల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. రానున్న ఏడాది కాలంలో నియోజకవర్గంలోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.బీసీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశంలో మాజీ మంత్రి వేణు ప్రజలను తప్పుదోవ పట్టించారని మంత్రి విమర్శించారు. బీసీల సమస్యలపై నాయకులు వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని సూచించారు."మానవసేవే మాధవసేవ" అనే స్ఫూర్తితో తాను సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పేదరికం కారణంగా ఎవరికీ వైద్యసహాయం అందకుండా పరిస్థితి ఏర్పడకూడదనే సంకల్పంతో అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు సహాయం అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వివరించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారానే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.

**కూటమి నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలి**

ఎన్డీఏ కూటమి తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున ఎవరికి అవకాశం కల్పించినా, వారి విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, బీసీలంతా ఐకమత్యంతో ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.

**బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: గుత్తుల సాయి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి మాట్లాడుతూ, బీసీలకు పార్టీపరంగా 34 శాతం ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం చేపడుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు వ్యక్తిగతంగా, సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రజలకు సహాయం అందించడం అభినందనీయమని తెలిపారు.

**బీసీలంతా ఐకమత్యంగా ఉండాలి: వాసంశెట్టి సత్యం**

సమ్మేళనానికి అధ్యక్షత వహించిన కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, బీసీలంతా ఐకమత్యంగా ఉండి ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని తెలిపారు.బీసీ సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కూటమి ఐక్యతతో ముందుకు సాగుదాం**

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ, బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కూటమి అధిష్ఠానం నిర్ణయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి పార్టీల మధ్య ఐక్యతే ప్రజాసేవకు బలమని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నిర్ణయాలకు కట్టుబడి, సమష్టి కృషితో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు పెంద్ర రమేష్‌తో పాటు దంగేటి గౌరీశంకర్, మేడిశెట్టి సూర్యనారాయణ, సనపల ధనరాజు, వనుం వీరబ్రహ్మం, టేకుమూడి సత్యనారాయణ, కుడుపూడి పణితేజ,వివిధ బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీల ఐక్యత, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# కాకినాడలో ఐఎన్ సీఓఐఎస్ ప్రాంతీయ కేంద్రం

- రూ.100 కోట్ల పెట్టుబడితో కీలక ముందడుగు
- సీఐఐ సదస్సులో అవగాహన ఒప్పందం.. ఎంపీ సానా సతీష్ బాబు కృషి ఫలితం
- మత్స్యకారులకు మెరుగైన సముద్ర సమాచార సేవలు.. స్థానికులకు ఉపాధి అవకాశాలు



**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12:**కాకినాడలో ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్
ఐఎన్ సీఓఐఎస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర రంగ అభివృద్ధి, తీరప్రాంత మత్స్యకారులకు మెరుగైన సమాచార సేవలు అందించడమే లక్ష్యంగా కాకినాడలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో ఈ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టుకు దశలవారీగా రూ.100 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించగా, స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

**ఎంపీ సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవ**

కాకినాడలో ప్రాంతీయ కేంద్రం ఐఎన్ సీఓఐఎస్‌ఏర్పాటుకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తీరప్రాంత మత్స్యకారులకు సముద్ర పరిస్థితులు, చేపల వేటకు అనుకూలమైన ప్రాంతాలు, వాతావరణ సంబంధిత సమాచారాన్ని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు.ఈ క్రమంలో 2026 జూలై 21న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ను కలిసి కాకినాడలో ఐఎన్ సీఓ ఐఎస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఈ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 9న ఎంపీకి సమాచారం అందించింది. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు కోసం ఐఎన్ సీఓఐఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా, జిల్లా యంత్రాంగం అనువైన స్థలాన్ని గుర్తించినట్లు సమాచారం.

**మత్స్యకారులకు ఆధునిక సముద్ర సమాచార సేవలు**

కాకినాడలో ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే మత్స్యకారులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. సంభావ్య చేపల వేట ప్రాంతాల (పొటెన్షియల్ ఫిషింగ్ జోన్స్) వివరాలు, సముద్ర పరిస్థితులు, వాతావరణ సమాచారం వంటి సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది.ట్యూనా, హిల్సా వంటి చేపల వేటకు సంబంధించిన సమాచారంతోపాటు, సముద్ర ఉష్ణోగ్రతల ప్రభావం పగడపు దిబ్బలపై ఎలా ఉంటుందనే అంశానికి సంబంధించిన హెచ్చరికలు, సముద్ర పరిశీలన డేటా వంటి సేవలు కూడా ఉపయోగపడనున్నాయి. దీనివల్ల మత్స్యకారులు సమాచార ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి, సముద్ర వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి తోడ్పాటు లభించనుంది.

**సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు ఊతం**

కాకినాడకు ఉన్న ఓడరేవు సదుపాయాలు, విస్తారమైన తీరప్రాంతం, ఆక్వా రంగం, సముద్ర సంపద దృష్ట్యా ఐఎన్ సీఓఐఎస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు ప్రాధాన్యం ఏర్పడనుంది. సముద్ర సమాచార సేవలతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన,అనుబంధ సేవల రంగాల్లోనూ కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే మత్స్యకారులకు మెరుగైన సమాచార సేవలు అందడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే వీలుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి కల్పించడం, సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడం వంటి లక్ష్యాల సాధనలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది.కాకినాడను సముద్ర సమాచార సేవలు, పరిశోధన, మత్స్య పరిశ్రమలకు ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఈ ప్రతిపాదన ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

# కాకినాడ మేయర్ సీటు శెట్టిబలిజలకు కేటాయించాలి



**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12 :** కాకినాడ మేయర్ పదవిని శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించాలని, జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు కడలి ఈశ్వరికి మేయర్ టికెట్ ఇవ్వాలని శెట్టిబలిజ సామాజిక వర్గ నాయకులు కోరారు. సోమవారం కాకినాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మేయర్ పదవిని బీసీ మహిళకు కేటాయించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ రూరల్ పరిధిలో సుమారు 80 వేల మంది శెట్టిబలిజ సామాజిక వర్గీయులు ఉన్నారని, కడలి ఈశ్వరికి అవకాశం కల్పిస్తే ఇతర బీసీ కులాల మద్దతుతో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కడలి ఈశ్వరి చురుగ్గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ సంఘం నగర అధ్యక్షుడు చొల్లంగి వీరబాబు, మాజీ జెడ్పీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు, చెల్లుబోయిన సూర్యప్రకాశం, వాసంశెట్టి రాజేశ్వరరావు,వాసంశెట్టి త్రిమూర్తులు, బత్తుల భవాని,తుట్టా లీలావతి, గుత్తుల రమణ,దొడ్డి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతకు పెద్దపీట





- గడువులోగా పనులు పూర్తి చేయాలి: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- పుష్కరాల అభివృద్ధికి రూ.300 కోట్లు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.174 కోట్లు
- రహదారుల పనుల్లో వేగం పెంచాలి.. భూసేకరణ సమస్యలకు త్వరిత పరిష్కారం

**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 12 :**గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యమిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనుల్లో జాప్యాన్ని నివారించి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సోమవారం కాకినాడలో జిల్లా ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.174 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. రహదారుల పనుల్లో వేగం పెంచాలి.ఎన్డీబీ నిధులతో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేసిన నేపథ్యంలో పనులు మరింత వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఏడీబీ నిధులతో చేపడుతున్న రహదారుల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.సీఆర్ఐఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి పనుల్లోనూ పురోగతి పెంచాలని, పనుల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని పేర్కొన్నారు. భూసేకరణ సమస్యలకు త్వరిత గతిన పరిష్కారం చూపాలి.

రహదారుల నిర్మాణానికి సంబంధించి ఎక్కడైనా భూసేకరణ సమస్యలు ఎదురైతే, వాటిని టాస్క్‌ఫోర్స్ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భూసేకరణ కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శిథిలావస్థకు చేరిన ఆర్ అండ్ బి శాఖ కార్యాలయాలను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. శాఖాపరమైన సమస్యలను పరిష్కరించడంతోపాటు కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు.బ్రిడ్జి డిజైన్ల విభాగంలో సిబ్బంది కొరత, ఆర్ అండ్ బి శాఖలో సచివాలయ సిబ్బంది వినియోగానికి సంబంధించి ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి పేర్కొన్నారు. శాఖలో పనుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఇతర వనరుల వినియోగంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి, నాణ్యత, గడువుల విషయంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

# మహాలక్ష్మమ్మ చెరువు పరిశుభ్రతకు చర్యలు

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:**మండలంలోని చొప్పెల్ల గ్రామ పంచాయతీ సమీపంలో గల మహాలక్ష్మమ్మ చెరువు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి పి.రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పర్యవేక్షణలో కూటమి నాయకుల సమక్షంలో డ్రోన్ సహాయంతో కలుపు మందు పిచికారి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు, వివిధ రకాల ముళ్ళ చెట్లు, తూటుకాడ వంటివి చెరువు పరిసరాల్లో బాగా పెరిగాయన్నారు. దీనిపై స్థానికుల అభ్యర్థన మేరకు చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగిరెడ్డి స్వామి,బళ్ళ హరికృష్ణ, నాగిరెడ్డి మహేష్, సుంకర శ్రీరాములు, మద్ది సతీష్, పళ్ళ రామకృష్ణ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పర్యాటక వాహనాల్లో ఆదివాసీ యువతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి



- మారేడుమిల్లి టూరిజంలో గిరిజనుల ఉపాధి హక్కులను కాపాడాలి
- బొలెరో వాహనాల నిర్వహణలో స్థానిక యువతకు అన్యాయం సహించేది లేదు
- బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- హక్కులను కాలరాస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ హెచ్చరిక

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12 :**మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలో సందర్శకులను తరలించే బొలెరో వాహనాల నిర్వహణలో స్థానిక ఆదివాసీ యువతకే తొలి ప్రాధాన్యం కల్పించాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ఉద్దేశించిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, కమిటీ సభ్యులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, సాధల విద్యాసాగర్, కంభం శాంతిరాజు మాట్లాడుతూ మారేడుమిల్లి మండలంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ దాని ఫలాలు స్థానిక ఆదివాసీలకు అందడం లేదని విమర్శించారు. పర్యాటకులను సందర్శనీయ ప్రాంతాలకు తీసుకెళ్లే బొలెరో వాహనాల నిర్వహణలో గిరిజన యువత అనేక అడ్డంకులు, బెదిరింపులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై బాధిత యువకులు సీపీఎంను ఆశ్రయించడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**గిరిజనుల ఉపాధి హక్కులను పరిరక్షించాలి**

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన 1/70 చట్టం, పేసా చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా స్థానిక ఆదివాసీల ప్రయోజనాలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. పర్యాటకాన్ని నమ్ముకుని జీవిస్తున్న గిరిజన యువత ఉపాధిని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. మారేడుమిల్లిలో పర్యాటక వాహనాల నిర్వహణ, అనుమతులు, పర్మిట్ల కేటాయింపులో స్థానిక ఆదివాసీ యువతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.పర్యాటక రంగంలో బయటి వ్యక్తులు, కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇస్తూ స్థానిక గిరిజన యువతను పక్కనపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో లభించే ఉపాధి అవకాశాలు ముందుగా స్థానిక ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**బెదిరింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి**

పర్యాటక వాహనాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ యువతను కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై ఐటీడీఏ, పోలీసు, రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజన యువతను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం, అక్రమంగా కేసులు బనాయించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలి**

పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయంలో స్థానిక గిరిజన కుటుంబాలకు తగిన వాటా దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. బొలెరోతో పాటు ఇతర పర్యాటక వాహనాల నిర్వహణలో ఆదివాసీ యువతకు అవకాశాలు కల్పించాలని, స్వయం ఉపాధి కోసం ముందుకొచ్చే యువతకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలని సూచించారు. రవాణా రంగంలో గిరిజన యువత ఆర్థికంగా స్థిరపడేందుకు ఐటీడీఏ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు.

**అన్యాయం కొనసాగితే ఆందోళనలు ఉద్ధృతం**

మారేడుమిల్లి పర్యాటక అభివృద్ధి పేరుతో స్థానిక ఆదివాసీల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోబోమని మట్ల వాణిశ్రీ హెచ్చరించారు. గిరిజనుల హక్కులను కాలరాసే చర్యలు కొనసాగితే సీపీఎం ఆధ్వర్యంలో ఆదివాసీలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే, వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ గిరిజనుల చట్టబద్ధమైన హక్కులను గౌరవించాలని కోరారు. ఆదివాసీ యువతకు న్యాయం జరిగే వరకు సీపీఎం ప్రాంతీయ కమిటీ అండగా ఉంటుందని తెలిపారు. పర్యాటక, ఐటీడీఏ, పోలీసు, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి మండల బొలెరో అసోసియేషన్ యూనియన్ నాయకులు దూడ సందీప్ కుమార్, కంభం విజయ్ కుమార్, రమణ, సూరిబాబు, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేజే గురువు ఆధ్వర్యంలో వైభవంగా సామూహిక లక్ష కుంకుమ పూజ

-వీరవరం వనదుర్గ అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భవానీ భక్తులు



**కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్,12:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీ వీర వెంకట బ్రహ్మ (జేజే గురువు ) ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు పేటతుళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.సాయంత్రం 6 గంటల నుంచి భవానీ భక్తుల కోసం సామూహిక లక్ష కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సూర్య దత్త శర్మ, శ్రీ మోహన్ దత్త శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రేగడమిల్లి రామదేవ్ శర్మ (రాంబాబు) పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవానీ భక్తులు సామూహిక లక్ష కుంకుమ పూజలో పాల్గొని వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

# పినపళ్ళలో రూ.25 లక్షల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించిన కూటమి నాయకులు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:**కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని పినపళ్ళ కూటమి నాయకులు వ్యాఖ్యానించారు.గ్రామంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ ల సహకారంతో రూ.25 లక్షల విలువైన అభివృద్ధి పనులకు సోమవారం కూటమి నాయకులు మాజీ సర్పంచ్ సంగిత సుభాష్, వక్కపట్ల లక్ష్మణరావు, పెద్దిరెడ్డి పట్టాభి, గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ జీపీ,15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణంతో పాటు,ఓఎన్జీసీ ఫండ్స్ సుమారు రూ.10 లక్షల నిధులతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి పనులను మొదలుపెట్టారు. త్వరలోనే ఈ పనులన్నీ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వారు తెలిపారు.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గాయత్రీదేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు.




**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్,12:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు.దశరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# వీఆర్ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలి

- వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలి
- సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా విధులు అప్పగించొద్దు
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు
- గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ హెచ్చరిక




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 12:** గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, గ్రామ సేవకుల సంఘం (59/86--సీఐటీయూ) పోలవరం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ రహమాన్, పోలవరం జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నామినీలను వీఆర్ఏలుగా గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ రహమాన్ మాట్లాడుతూ వీఆర్ఏలతో సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా విధులు నిర్వహింపజేయడం సరికాదన్నారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆదేశాలను అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. అదనపు విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలకు ప్రయాణ భత్యం (టీఏ), దినభత్యం (డీఏ) చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

**సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం**

సమావేశం అనంతరం సంఘం నాయకులు రంపచోడవరం సబ్ కలెక్టర్‌ను కలిసి వీఆర్ఏల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రేడ్--2 వీఆర్వో పోస్టుల భర్తీకి సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా అప్పగిస్తున్న విధులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. పదోన్నతులకు సంబంధించిన సమాచారాన్ని సీసీఎల్ఏ కార్యాలయానికి పంపుతామని, వీఆర్ఏలతో సర్వీస్ రూల్స్ ప్రకారమే విధులు నిర్వహింపజేస్తామని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

**వీఆర్ఏల సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

ఈ సమావేశంలో పోలవరం జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సీఐటీయూ నాయకుడు వెంకట్, జిల్లా అధ్యక్షుడిగా కె. యోన, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేగల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా గడ్డం రవిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా సారపాటి వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కాపుల నాగేశ్వరరావు, మాచర్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. వీఆర్ఏల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 12.** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎమ్. యేసుబాబు ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, ఆస్తి పన్ను, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కొన్ని ఫిర్యాదులపై వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

"ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలి" అని కమిషనర్ యేసుబాబు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు, మున్సిపల్ ఇంజనీర్ వై వెంకటరమణ ,అసిస్టెంట్ సిటీ ప్లానర్ జీ సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి ప్రసాద్ రావు, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి వి జగదీశ్వర్ రావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠంలో 2 రోజు బ్రహ్మ చారిని రూపంలో దర్శనం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబరు 12.** తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం లో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండవ రోజు అమ్మవారు బ్రహ్మ చారిని రూపంలో విశేష పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ బ్రహ్మచారి నీ రూపాన్ని అర్థించడం ద్వారా ఇంద్రియ నిగ్రహం మనోత్సర్యం ఆత్మవిశ్వాసం కలుగుతుంది అన్నారు. పార్వతీదేవి పరమేశ్వరుని వివాహం చేసుకునే నిమిత్తం కఠోరమైన తపస్సు ఆచరించిన క్రమంలో బ్రహ్మచారినిగా దర్శనమిస్తారని బ్రహ్మచారి నీ దేవిని కుజ గ్రహానికి అధిపతిగా చెబుతూ కుజ గ్రహ దోషాలు ఈ అమ్మవారిని అర్చించడం ద్వారా నివృత్తి అవుతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు తోపాటు విశేష హోమాలను సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో దాటిన శ్రీనివాస్ అలివేలు మంగతాయారు దంపతులు పోతుల అన్నవరం దంపతులు వానపల్లి వెంకటేశ్వరరావు కొండబాబు దంపతులు గారపాటి శ్రీనివాసరావు దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణులతో అమ్మవారికి విశేష సేవలు అందించారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం



- ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు
- గ్రీవెన్స్‌కు 79, రెవెన్యూ క్లినిక్‌కు 15 దరఖాస్తులు
- మారుమూల గిరిజన గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, అక్టోబర్ 12 :** ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా పోలవరం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ డి. పృథ్వి రాజ్ కుమార్, ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 79 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 15 దరఖాస్తులు కలిపి మొత్తం 94 అర్జీలు అందినట్లు వెల్లడించారు.

**పిడతమామిడిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలి**

గంగవరం మండలం పిడతమామిడి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్, ఇంటర్నెట్ నెట్‌వర్క్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, సామాన్య ప్రజలకు సమాచార వ్యవస్థ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పిడతమామిడి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని నిడమర్తి శ్రీను, జె. కాటమస్వామి, బి. సురేష్ కుమార్ వినతిపత్రం అందజేశారు.

**గొడుగురాయిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి**

వై.రామవరం మండలం గొడుగురాయి గ్రామంలోని దేవిగుడి వీధిలో నివసిస్తున్న 22 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. తమ వీధిలో తాగునీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని చోడి బుల్లిదొర, కురుసం సుబ్బన్నదొర, బోడిదొర అధికారులకు అర్జీ సమర్పించారు.

**నేలకోట ఆర్అండ్ఆర్ కాలనీకి రహదారి, సాగునీరు కల్పించాలి**

దేవీపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన నేలకోట గ్రామ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని బాధితులు కోరారు. నేలకోట ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి పాత నేలకోట గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మించాలని, సుమారు 50 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 18 సంవత్సరాల ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హులైన వారికి పరిహారం మంజూరు చేయాలని చెదల నాగిరెడ్డి, కడబాల శ్రీనివాసరావు రెడ్డి, చెదల వెంకటరెడ్డి వినతిపత్రం అందజేశారు.

**సూర్లవాడ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేయాలి**

రంపచోడవరం మండలం సూర్లవాడ గ్రామంలో మధ్యలో నిలిచిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. గ్రామ ప్రజల సామూహిక అవసరాలకు ఉపయోగపడే భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సాదల జగన్మోహన్ రెడ్డి, కుర్ల ఆదిరెడ్డి, సాదల ఎర్రరెడ్డి అధికారులకు దరఖాస్తు సమర్పించారు.

**పూతిగుంట శివాలయాన్ని అభివృద్ధి చేయాలి**

వై.రామవరం మండలం పూతిగుంట గ్రామంలోని పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పూతిగుంట నుంచి తోటకూరపాలెం గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మించాలని కోరారు. ఈ మేరకు బచ్చుల వెంకటరెడ్డి, కలిమెల నాగేశ్వరరావు, కలిమెల బాబురావు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**అర్జీల పరిష్కారానికి చర్యలు**

ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన సబ్ కలెక్టర్ పృథ్వి రాజ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ శరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, ఉద్యాన శాఖ అధికారి దేవదానం, డీఎంహెచ్‌వో పి. సరిత, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, పీహెచ్‌వో నరేంద్ర కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా ట్రెజరీ అధికారి కుమార్, పీఏవో ఎల్. రాంబాబు, సీపీవో వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీధర్, రవీంద్రబాబు, శివ, శ్రీరామచంద్రమూర్తి, డీఈలు పి. వెంకటరమణ, చైతన్య, శివ, సుబ్బారావు, రమేష్, ఆర్టీవో రాజేష్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ ఉపేంద్ర, ఐటీడీఏ ఏవో ఎర్రంశెట్టి రాజు, ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్ సాలెం రాజ్, డీపీఎం జి. నాగభూషణరావు, జీసీసీ డీఎం జయశ్రీ, తహసీల్దార్లు సీహెచ్ బాలాజీ, అమ్మాజీ, సరిత, సీహెచ్ శ్రీనివాసరావు, శివ, కరక సత్యనారాయణ, తేజస్విని, శ్రీరాములదొర, ఎంపీడీవోలు ప్రసాద్, బాపన్నదొర, సాల్మన్ రాజ్, లక్ష్మణరావు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారు గౌరీ దేవిగా అలంకరణ







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 12.** దేవి నవరాత్రుల సందర్భంగా ..తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్.. గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణంలో... 17వ వార్డు, విశ్వ దుర్గేశ్వరి పేటలో శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారి ఆలయం నందు రెండవ రోజు శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిని గౌరీ దేవిగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయాన్ని ఎంతో సుందరంగా అలంకరించి వచ్చిన భక్తులందరికీ అమ్మవారు. దేదీప్యమానంగా, కనులు విందు చేసే విధంగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఇంత చక్కగా భక్తులు దర్శించుకునే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయం మొత్తాన్ని, గర్భగుడిని, ఉత్సవ విగ్రహం మండపాన్ని, పువ్వుల తో ఎంతో అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పప్పుల నాగ వెంకట అప్పారావు శ్రీమతి పుష్పలత, తాడి వెంకట నరసింహమూర్తి శ్రీమతి పద్మావతి దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, భవానీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com